ఓ సాయంకాలం నాలుగు గంటల వేళ టిఫిన్ చేసే హడావిడిలో ఉన్నాను. కాలింగ్ బెల్ మోగితేఎవరా అని వెళ్ళి చూశాను. దీప మా స్నేహితురాలు విశాలాక్షి కూతురు. తలుపుతియ్యగానే లోపలికి రాకుండా వాకిటలోనే చెప్పడం మొదలెట్టింది.

''ఆంటీ? మా అమ్మ మిమ్మల్నొకసారి రమ్మంది''

# డాక్టర్లూ! జోహార్లు!

— ఆర్. ఎస్. హైమవతి

కథ



''ఏమైందమ్మా? ఏమిటి విషయం? మీ అమ్మ ఇలా ఎప్పుడూ కబురు పెట్టదే !'' అన్నాను.

''లేదాంటీ ! నిన్న డాక్టరు అమ్మ పళ్ళన్నీ పీకేశారు. ఏమీ తినలేకపోతోంది. జ్యూస్ తప్ప కడుపులోకి ఏమీ వెళ్ళడం లేదు. మీతో ఏదో మాట్లాడాలిట. ఒకసారి రమ్మంది'' అంది.

''సరే ! వస్తాను. మా సుజాత, శివ వస్తారుగా స్కూలు నించీ. వాళ్ళకి టిఫిన్ పెట్టీ. పాలు అవీ ఇచ్చి వస్తాను. లోపలికి వచ్చి నువ్వు కూడా టిఫిన్ తీసుకొని వెళ్ళువు గాని రా !'' అన్నాను.

''వస్తాంటీ ! నేను త్వరగా వెళ్ళాలి. మందులు కొనుక్కుని వెళ్ళాలి. ఇంట్లో అమ్మ ఒక్కత్తే నీరసంగా పడుకుని వుంది. మాట కూడా గట్టిగా రావడం లేదు. మరోసారి వస్తాను'' అంటూ పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది దీప.

నా చుట్టూ విశాలాక్షి తాలూకు జ్ఞాపకాలు ముసురుకుంటున్నాయి.

*　　*　　*

విశాలాక్షి ఎప్పుడూ ఎంతో హుషారుగా ఉండే ఇల్లాలు. ఒక్క క్షణం తీరిగ్గా.కూర్చో దు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. 'ఏమీ తోచడం లేదు. కాల క్షేపం లేదు' అంటూ ఎవరింటికో ఒకరింటి కి పోయి అనవసరమైన వ్యర్థ ప్రసంగాలు చేస్తూ గంటలు గంటలు వారి టైము పాడు చేసుకోడమే కాక ఎదుటి వారి సమయాన్ని కూడా వృధా చేసే వారిని చూస్తే దానికి పరమ అసహ్యం.

అది ఎక్కువ మందితో స్నేహాలు పెట్టుకో దు. దాని కొద్ది మంది స్నేహితుల్లో నేనొకదా న్ని

### అనుభూతి

టీచర్: ఒరేయ్ రాజా! 'చార్మినార్' గురించి నీకేమి తెలుసో కొంచెం చెప్పరా?
రాజు: అది కాలిస్తే గొప్ప అనుభూతి పొందొచ్చు సార్!
టీచర్: ఆ!

- పి. సునీల్, పెద్దకొట్టాల



మేం ఇద్దరం ఒకే వయసు వాళ్ళం. ఒకే భావాలు కలవారం కనుక మా మనసులు కలిసి చేరువయ్యాము. ఒకరి కష్టసుఖాలు మరొకరికి చెప్పుకోకుండా ఉండలేము.

ఆమధ్య ఒక రోజు మార్కెట్లో కనిపించి చెప్పింది. తనకి మోకాళ్ళు విపరీతంగా నొప్పులు వస్తున్నాయని, పైకి ఏ మందులు వేసి రుద్దినా నొప్పులు తగ్గడం లేదని, డాక్టరు దగ్గర చూపించుకోవాలనుకుంటున్నాననీను.

"త్వరగా చూపించుకో ! ఈ రోజుల్లో రకరకాల రోగాలు చెప్తున్నారు. అశ్రద్ధ చేయకు" అని చెప్పి వచ్చాను.

ఆ విధంగా కలిసి నెలదాటింది. మళ్ళీ మేమిద్దరం కలవలేదు. కారణం అదీ బిజీయే ! నేనూ బిజీయే !

ఇప్పుడీ విధంగా పళ్లెందుకు పీకించుకోవలసి వచ్చిందో నాకు అంతు పట్టలేదు. దాని పళ్ళు నిక్షేపంలా దానిమ్మ గింజల్లా వుంటాయి. నాకు తెలిసినంతవరకూ, దానికి పిప్పి పళ్లూ లేవు. జంతికలు, చక్రాలు, చేగోడీలు అన్నీ కరకరా నములుతుంది. అలా కరకర లాడే తినుబండారాలే దానికిష్టం. ఇక నించీ పాపం దాని గతేమిటి?

ఇలా ఆలోచిస్తూండగానే మా పిల్లలు వచ్చేశారు. వాళ్లకి అల్పాహారం, పాలు ఇచ్చేసి -"మీరు కాసేపు హోమ్ వర్క్‌లు చేస్తూనో, ఆడుకుంటూనో ఉండండి. నేను ఇప్పుడే విశాలాక్షి ఆంటీ ఇంటికి వెళ్లి వస్తాను" అని చెప్పి వెళ్లాను.

* *

ఎప్పుడూ హుషారుగా ఎదురు వచ్చే విశాలాక్షి పడుకుని ఉండడమే నాకు బాధనిపిస్తే నవ్వితే ముత్యాల్లా మెరిసిపోయే దాని పలువరున లేని తాతమ్మల నోరు లాంటి నోరు నన్ను మరీ బాధ పెట్టింది.

"ఏమైంది విశాలీ ! నీకు పళ్ళు నొప్పులున్నట్లు నాకెప్పుడూ చెప్పలేదే ! ఉన్నట్లుండి ఎందుకు పళ్లు పీకించుకున్నావ్?" అడిగాను.

దానికి ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికి వచ్చేసింది. నన్ను పట్టుకుని చిన్నపిల్లకన్నా కనాకష్టంగా బావురుమని ఏడ్చేసింది.

"ఛీ ! ఏడవకు. పిప్పి పళ్లేమైనా అయ్యాయా? అయినా ఏది పిప్పి పన్నో అదే పీకుతారు గాని అన్నీ పీకేశారేమిటి?" అన్నాను.

మరోసారి భోరుమని ఏడ్చి తరవాత మెల్లిగా తమాయించుకొని చెప్పింది.

"నాకు మోకాళ్ళు నెప్పులు పెడుతున్నాయని ఆ మధ్య చెప్పాను కదా! దాని కోసం ఓ మంచి పేరున్న స్పెషలిస్టు దగ్గరికి తీసుకెళ్ళారు మావారు. ఆయన అన్ని పరీక్షలూ చేసి వాటిల్లో ఏమీ తేలలేదని చెప్పారు. అక్కడితో ఊరుకోక దంత వైద్యుడి దగ్గరకెళ్ళి పళ్ళు పరీక్ష చేయించుమన్నారు. ఆ రిపోర్టు తనకి చూపించమన్నాడు.

తరువాత ఇంకేముంది? మా వారు పళ్ళ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళారు. ఆయన పళ్ళన్నీ పరీక్ష చేసి కొన్ని పళ్ళకి కన్నాలు ఉన్నాయని చెప్పారు.

ఇంకేముంది? ఈ రిపోర్టు ఆ స్పెషలిస్టు దగ్గర చూపించేసరికీ ఆయన వెంటనే - "ఆఁ! అదే కారణం. అందువల్లే ఈ మోకాళ్ళ నెప్పులు. "అంటూ తీర్మానం చేసి ఆ పళ్ళు పీకేస్తే కాళ్ళ నెప్పులు తగ్గిపోతాయని చెప్పాడు. ఇక మా ఆయన నేను వద్దంటున్నా వినకుండా - "మాకాళ్ళ నెప్పులతో కూర్చోలేక, నుంచోలేక ఏం బాధ పడతావు? కావాలంటే కట్టుడు పళ్ళు పెట్టుకో వచ్చులేఁ" అంటూ నిక్షేపంలాంటి పళ్ళన్నీ పీకించేశారు. అని చెప్పింది విశాలి.

నాకు అంత విషాదంలోనూ ఫక్కున నక్కొచ్చింది.

"ఏమిటే నవ్వు తున్నావు? నా పరిస్థితి నీకు నవ్వు లాటగా ఉందా?" అంది కోపంగా.

"లేదే! బాబూ! మా చిన్నప్పుడు మా నాయనమ్మ చెప్పే సామెతల్లో ఒకటి నీ పరిస్థితి వినగానే గుర్తొచ్చింది. అందుకే నవ్వాను. మరేం కాదు." అని దాన్ని అనునయించాను.

"అదేమిటో చెప్పేడువు. నేనూ నవ్వుతాను."

"ఏం లేదు. 'తుంటి మీద కొడితే మూతి పళ్ళు రాలాయట. అసహజమైనదీ అర్థం లేనిదీ ఏదైనా చెప్పినప్పుడు అంటూండేది మా బామ్మ." అన్నాను.

"ఇప్పుడు నా పరిస్థితి సరిగ్గా అలాగే ఉంది" అంటూ అదీ నవ్వేసింది.

నవ్వితే ముత్యాల్లా మెరిసి పోయే దాని పలువరున లేని బోసి నోటిని చూడలేక తలపక్కకి తిప్పుకున్నాను.

దానికి ధైర్యం చెప్పడం కోసం - అనవసరంగా ఏడిచి మరింత హైరాన పడకు. అసలే నీరసంగా ఉన్నావు. మీ వారు చెప్పినట్లు పళ్ళు కట్టించుకుంటే సరిపోతుంది. కాళ్ళ నెప్పులతో పన్లు చేసుకోవడం మరీ కష్టం కదా! మొదట్లో కొంచెం కష్టంగా అనిపించినా క్రమేపీ అదే అలవాటౌతుంది." అని కాసేపు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పిదాన్ని కాస్త ఉషారుగా ఉండేలా చేసి వచ్చేశాను.

*** *** ***

తరువాత చాలా రోజుల వరకూ విశాలిని కలవడానికి వీలుకాలేదు. ఎలాగో వీలు చేసుకుని ఒక రోజు చూసి వద్దామని వెళ్ళాను.

దాని మొహంలో మార్పుచూసి ఆశ్చర్యపోయాను. దానిమ్మ గింజల పళ్ళ స్థానంలో ఆనపగింజల పళ్ళు ఉన్నాయి. మొహమే చూడ్డానికి ఏదోలా అనిపించింది. దీనికి బదులు ఆ బోసి నోరే బాగుందేమో అని కూడా అనిపించింది. నేనా మాటంటే అది మరీ బాధ పడుతుందని ఏమీ అనలేదు.

" ఏమే విజ్జీ! నాకీ పళ్ళు నప్పాయా? లేదు కదూ!" అంది.

"ఫరవాలేదులేవే! నమిలి మింగడానికి పళ్ళు కావాలి కదా! ఏదో ఒకటి పెట్టుకోక తప్పదుమరి. అయినా మరీ అసహ్యంగా లేవులే! అది సరే గాని నీ కాళ్ళ నెప్పులు తగ్గాయా?" అడిగాను.

"లేదే! అదే బాధగా ఉంది. ఈ కాళ్ళ నెప్పుల కోసం డాక్టరు ఫీజులు, టెస్టులు పళ్ళు పీకించడం, మళ్ళీ కట్టడం, మందులు, ఇంజక్షన్లు అన్నీ కలిపి దగ్గర దగ్గర పదివేలు దాకా అయింది. ఇంత ఖర్చు చేసి శ్రమ పడినందుకు కాళ్ళ నెప్పులు తగ్గాయి అంటే అదీ లేదు. 'సొమ్ము పోయి శని పట్టింది అంటారు. చూడు సరిగ్గా అలా ఉంది" అంది.

"మెల్లిగ్గా తగ్గుత ఏమోలే!" అన్నాను. దాన్ని నిరుత్సాహపరచడం ఇష్టం లేక.

"ఏమో! నెలలోపలే. తగ్గిపోతాయన్నారు. దగ్గర దగ్గర రెండు నెలలౌతోంది. ఇంత వరకు తగ్గలేదు సరికదా! ఈ మధ్య ఎక్కువౌతున్నట్లుగా అనిపిస్తోంది" అంది.

"అలా నిరుత్సాహపడకు. డాక్టరు ఊరికే చెప్తారా? కొంత కాలం పట్టచ్చేమో తగ్గడానికి." అన్నాను.

"ఏమోనే! నాకు నమ్మకం పోతోంది. మొన్న మా వారి ఫ్రెండు చెప్పాడు. నేను చూపించుకున్న ఆ స్పెషలిస్టుకి ఆ పళ్ళ డాక్టరు స్నేహితుడట. అందుకే ఆయన దగ్గరకే వెళ్ళమని ఈయన చెప్తుంటాడట. ఆయనకి సంపాదన ఇప్పించాలనే ఉద్దేశ్యంతో అలా చెప్పి ఉంటాడని అంటున్నారు." అంది విశాలి.

"అయితే స్నేహితుడికి సంపాదన కల్పించడం కోసం వైద్య శాస్త్రంలోనే లేని రోగం కల్పించి చెప్పి నీ పళ్ళు పీకించావుంటావా?" అన్నాను.

"ఏమో! నా కలాగే అనిపిస్తోంది" అంది.

డాక్టర్లని సమర్ధిస్తూ దాని అనుమానాన్ని నివృత్తి చేసేంత సైన్సు విజ్ఞానం నాకు లేదు. అది అనుభవంలో చెప్తున్న విషయాన్ని కాదని తోసి పుచ్చనూ లేనూ. అందుకే ఓ నిట్టూర్పు విడిచి వచ్చేశాను.

★

మీరు టి.వి. కార్యక్రమాలు చూస్తున్నారా?

టి.వి. కార్యక్రమాలు మీరు రెగ్యులర్ గా చూసేవారైతే, వాటిలో మీకు నచ్చిన వాటిని లేదా నచ్చని వాటిని క్లుప్తంగా సమీక్షిస్తూ ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధానికి పంపించండి. అభిప్రాయంతో పాటు మీ ఫొటోను జతచేయడం మరచిపోరు కదూ!

చిరునామా: టి.వి. సమీక్ష
కేరాఫ్ ఆంధ్రప్రభ ఆదివారం
అనుబంధం
ఎక్స్‌ప్రెస్ కాంపౌండ్
దోమలగూడ, హైదరాబాద్
500 029.

